క్లుప్తంగా

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

జగిత్యాలరూరల్: విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం జగిత్యాల మినీ స్టేడియంలో మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆటల పోటీల ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలికలు కేవలం చదువులోనే కాకుండా క్రీడల్లో కూడా రాణించాలన్నారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమాధికారి నరేశ్, వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రమోద్, డీఈవో రాము, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్డీఆర్ఎఫ్ సేవలు అమోఘం



అవగాహన కల్పిస్తున్న ఎన్డీ ఆర్ఎఫ్ సభ్యులు

రాయికల్: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఎన్డీఆర్ఎఫ్ చేసిన సేవలు మరువలేనివని తహసీల్దార్ ఖయ్యూం అన్నారు. రాయికల్ మండలం ఇటిక్యాలలో ఎన్డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ ఆధ్వర్యంలో ప్రకృతి వైపరీత్యాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం ఎన్డీఆర్ఎఫ్ అధికారులు వివరించారు. కార్యక్రమంలో టీమ్ లీడర్ ముకేశ్, ఏఎస్సై దేవేందర్, ఆర్ఐలు పద్మయ్య, దేవదాస్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సీఐ సురేష్ బాబు

కోరుట్ల: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని కోరుట్ల సీఐ సురేశ్ బాబు అన్నారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో శనివారం మసీదుల ఇన్‌చార్జీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతీ మసీదులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

మెట్‌పల్లిరూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి అన్నారు. మెట్‌పల్లి మండలం వెల్లుల శివారులో ఇసుక లారీ, పట్టణంలోని డిపో వద్ద ఇసుక ట్రాక్టర్‌ను శనివారం పట్టుకున్నారు. పట్టుబడ్డ రెండు వాహనాలను డిపోకు తరలించారు. లారీ యాజమాని సిద్ధు, డ్రైవర్ ముత్యం, ట్రాక్టర్ యాజమాని సాగర్, డ్రైవర్ వికాస్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా కథలాపూర్ ప్రాంతం వైపు లారీల్లో ఇసుక నింపుకుని ఆర్మూర్ వైపునకు ఇక్కడి మార్గాల గుండా వెళ్తున్నట్లు గుర్తించారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే ఎంతటి వారినైనా వదిలేదిలేదని హెచ్చరించారు.

క్రికెట్ టోర్నీ విజేత నూకపల్లి



విజేతకు ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్సీ ఎల్.రమణ

మల్యాల: మండలంలోని రామన్నపేట మాజీ సర్పంచ్ వకుళాభరణం శ్రీనివాస్ స్మారక క్రికెట్ టోర్నీ పోతారం పాక్స్ చైర్మన్ అయిల్నేని సాగర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఫైనల్‌లో నూకపల్లి విజేతగా నిలిచింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ఎల్.రమణ విజేత టీంకు ట్రోఫీ అందజేసి, అభినందించారు. యువకులు ఆటల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో నూకపల్లి పాక్స్ చైర్మన్ బోయినపల్లి మదుసూదన్‌రావు, మాజీ జెడ్పీటీసీ రాంమోహన్‌రావు, మిట్టపల్లి సుదర్శన్, గడ్డం మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా వేంకటేశ్వరుని కల్యాణం

కోరుట్ల రూరల్: మండలంలోని గుమ్లాపూర్ గుట్టపై ఉన్న శ్రీ వేంకటేశ్వర ఆలయంలో కళ్యాణోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. స్వామి వారికి ప్రత్యేక పూజలు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. విద్యార్థుల నృత్యాలు, పాటలు అలరించాయి.



నరసింహ స్వామి కల్యాణం

పెగడపల్లి:మండలంలోని లింగాపూర్‌లో శ్రీలక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారి తిరుక్కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవాల నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత దినోత్సవంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు



జగిత్యాల: పర్యావరణ పరిరక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరిలో నిర్వహిస్తున్న జాతీయ సమైక్యత దినోత్సవం శిబిరంలో జగిత్యాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు. ఇందులో వలంటరీ శ్రీయ కుమారి, మనిషాల నాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వారిని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అభినందించారు.

విద్యార్థులు కొత్త టెక్నాలజీలో నైపుణ్యం పొందాలి



బస్సులో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

జగిత్యాల: విద్యార్థులు ఇప్పుడు వస్తున్న కొత్త కొత్త టెక్నాలజీలో నైపుణ్యం పొందాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. శనివారం యువ పారిశ్రామిక వేత్త మధులాష్ ఆధ్వర్యంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తి బస్సు యాత్రలో భాగంగా జగిత్యాలకు చేరగా జిల్లా కలెక్టర్ దానిని సందర్శించి మాట్లాడారు.దీనిలో ల్యాబ్‌లను పరిశీలించి 3డీ ప్రింటింగ్ ఓవర్‌బోర్డ్స్, అర్బన్ రియాల్టీ, వర్చువల్ రియాల్టీ వంటి ఆధునాతన పరికరాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలు మామూలుగా మొబైల్‌ఫోన్లలో చూస్తారని, కానీ దీంట్లో రియాల్టీగా ఉందన్నారు. పిల్లలందరూ చూసి కొత్తకొత్త టెక్నాలజీ నేర్చుకోవాలన్నారు. మధులాష్ యాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, డీఈవో రాము, తహసీల్దార్లు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు





జగిత్యాల, కోరుట్లలో బీఎస్ఎస్, బీజేపీ నాయకుల సంబరాలు

జగిత్యాల/జగిత్యాలరూరల్/రాయికల్/మెట్‌పల్లి రూరల్/కథలాపూర్/మల్యాల/సారంగాపూర్/కోరుట్ల/ ధర్మపురి: ఢిల్లీలో బీజేపీ భారీ మెజార్టీతో గెలుపొందడంతో శనివారం జిల్లా వ్యాప్తంగా బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో జిల్లా అధ్యక్షుడు యాదగిరిబాబు,బీజేపీ మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రాయికల్‌లో బీజేపీ నాయకుల సంబరాలు

19 ఏళ్ల లోపు వారికి మాత్రలు వేయాలి



మాట్లాడుతున్న ఎంఈవో సీతామహాలక్ష్మి

రాయికల్: పట్టణంతో పాటు, మండలంలోని 32 గ్రామాల్లో 19 ఏళ్లలోపు వారందరికీ అల్బెండజోల్ మాత్రలు వేయాలని మెడికల్ ఆఫీసర్ సతీశ్‌కుమార్ సూచించారు. శనివారం రాయికల్ మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలకు ఈనెల 10న జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో రాఘవులు, హెచ్‌ఈవో సాగర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

అల్బెండజోల్ మాత్రల పంపిణీపై అవగాహన

ధర్మపురి: నేషనల్ డివార్మింగ్ డే సందర్భంగా పిల్లలకు పంపిణీ చేసే అల్బెండజోల్ మాత్రలపై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. మాత్రల పంపిణీపై చర్చించారు. సమావేశానికి ప్రభుత్వ వైద్యులు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంఈవో సీతామహాలక్ష్మి, వైద్యాధికారి డాక్టర్ ఆస్మా తరుణం, సీహెచ్‌వో శ్రీనివాస్, హెచ్‌ఈవో సతీష్‌కుమార్, భూంలాల్, మహేంద్ర, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలపై రాజీలేని పోరాటం

జగిత్యాల: పెన్షనర్ల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ అన్నారు. శనివారం సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రిటైర్డ్ ఉద్యోగులు రిటైర్మెంట్ ప్రయోజనాలు సత్వరమే ప్రభుత్వం చెల్లించాలని కోరారు. అలాగే మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో బొల్లం విజయ్, విశ్వనాథం, హన్మంతరెడ్డి, ప్రకాశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై ఫిర్యాదు

మల్యాల: రెడ్డి కులంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని మండల రెడ్డి సంఘం నాయకులు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీసీ ఉద్యోగుల సమావేశంలో రెడ్డి కులస్తులను అవమానించే విధంగా వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్నపై కేసు నమోదు కేసి, చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల రెడ్డి సంఘం అధ్యక్షుడు బద్దం రాంరెడ్డి, నేరెళ్ల భూమారెడ్డి, కె.నర్సింహారెడ్డి, నల్ల జీవన్ రెడ్డి, లింగారెడ్డి, మల్లారెడ్డి, సతీశ్‌రెడ్డి, అనిల్ రెడ్డి, శ్రావణ్ రెడ్డి, రాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరెపెల్లిలో అభివృద్ధి పనులు ప్రారంభం

ధర్మపురి: మండలంలోని ఆరెపెల్లిలో శనివారం చేపట్టిన అభివృద్ధి పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించిన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కుంబాల మల్లేశ్, పంచాయతీ కార్యదర్శి మహేశ్, జెల్ల రాజన్న, రాజం, రవి, మల్లేశ్ తదితరులున్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని హోండా బైక్ షోరూమ్‌లో కరీంనగర్‌కు చెందిన మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ వంశీ ఆధ్వర్యంలో షోరూమ్ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 120 మంది సిబ్బందికి అవసరమైన షుగర్, బీపీ, 2 ఈకో పరీక్షలు చేపట్టి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికవర్ ఆస్పత్రి నిర్వాహకులు కిరణ్, మేనేజర్ శివ, రాకేశ్, కరుణాకర్, చంద్రశేఖర్, సాయితేజ పాల్గొన్నారు.

రైతులకు రుణాలు పంపిణీ

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల సహకార సంఘం పరిధిలోని జగిత్యాల, మోరపల్లి, అంతర్గాం, తాటిపల్లి, హన్మాజీపేట, పొలాస, జాబితాపూర్, పోరండ్ల గ్రామాల రైతులకు శనివారం రూ 28.98 లక్షల రుణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం చైర్మన్ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ అప్పులు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించి సంఘ అభివృద్ధికి పాటు పడాలని సూచించారు. అవసరమైన రైతులకు రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో సంఘం సీఈవో వేణు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

పెగడపల్లి: మండల కేంద్రంలోని శ్రీ స్వయంభూ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా ధాతలు విరివిగా విరాళాలు అందజేస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన కొత్త శ్రీనివాస్–జమున దంపతులు స్వామి వారికి పంచలోహ మకర తోరణం నిమిత్తం రూ. 30 వేలు, శివరాత్రి ఉత్సవాల సందర్భంగా వాల్ పోస్టర్ల కోసం ఆటో యూనియన్ సభ్యులు రూ. 10 వేలు శనివారం ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ అందజేత

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ ప్రాథమిక పాఠశాలలో పదో తరగతి చదివిన 2009–10 బ్యాచ్ పూర్వ విద్యార్థులకు రూ. 20 వేల విలువ గల ప్రింటర్‌ను హెచ్‌ఎం అచ్చ విజయభాస్కర్‌కు శనివారం అందచేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తిరుమలేష్, కళ్యాణ్, మిత్రబృందం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన జోగిరాం వంశీ కిడ్నీ కి సంబంధించిన వ్యాధితో బాధపడుతుండగా చికిత్స చేసుకునేందుకు శనివారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ రూ.2 లక్షలు ఎల్‌వోసీని బాధితుడికి అందచేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ధశరథ్‌రెడ్డి, నాయకులు జేడీ సుమన్, మహేందర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, మారు సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన నాయకులు



ఎమ్మెల్సీ కవితకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలానికి చెందిన నాయకులు శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవితను కలిశారు. గత కొన్ని రోజులుగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో ఉన్న జగిత్యాల మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొలుగూరి దామోదర్‌రావు, జగిత్యాల సింగిల్ విండో చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి, కల్లెడ సింగిల్ విండో చైర్మన్ సందీప్‌రావు కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేతో కలిసి పనిచేశారు. కానీ ఇటీవల ఎమ్మెల్సీ కవిత నుంచి పిలుపు రావడంతో శనివారం ఆమెను కలిసి పార్టీ బలోపేతానికి పూర్తిస్థాయిలో పనిచేస్తామని హామీ ఇచ్చారు.

భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి



ఎమ్మెల్సీకి వినతిపత్రం అందిస్తున్న పద్మశాలీలు

జగిత్యాల: పద్మశాలీ సంఘ భవనానికి నిధులు మంజూరు చేయాలని పట్టణంలోని హనుమాన్‌వాడకు చెందిన పద్మశాలీ నాయకులు ఎమ్మెల్సీ ఎల్.రమణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చంద్రమౌళి, రాజేశం, గట్టు సతీశ్, ఆనందరావు పాల్గొన్నారు.

మైతాపూర్‌లో పోలింగ్ కేంద్రాలు పెంచాలని వినతి



ఎంపీవోకు వినతిపత్రం ఇస్తున్న రాజేశ్

రాయికల్: మండలం మైతాపూర్‌లో స్థానిక ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాలను పెంచాలని కోరుతూ శనివారం మైతాపూర్ గ్రామానికి చెందిన తలారి రాజేశ్ ఎంపీవో సుష్మకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2884 మంది ఓటర్లున్న మా గ్రామంలో 3 బూత్‌లను ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని, పోలింగ్ బూత్‌లను పెంచాలని కోరారు.

భక్తమార్కండేయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఆలయంలో ఉత్సవమూర్తులు

జగిత్యాల: భక్తుల పాలిట కొంగుబంగారంగా నిలుస్తోంది భక్తమార్కండేయ దేవాలయం. జగిత్యాల నడిబొడ్డున ఉన్న ఈ ఆలయం 50 ఏళ్ల క్రితం నిర్మించింది. ప్రస్తుతం 49వ బ్రహ్మోత్సవాలు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. నేటి నుంచి ఈనెల 13వ తేదీ వరకు ఐదు రోజుల పాటు అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ప్రధాన అర్చకులు మేడిపల్లి శ్రీనివాస్‌శర్మ, తీగుల్ల విష్ణుశర్మ, ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.



సారంగాపూర్: మండలంలోని లచ్చక్కపేట రాయికల్ మండలం కుర్మపల్లి గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ రోడ్డుపై వర్షాలకు తారు పోయి పెద్ద గుంత ఏర్పడింది. ఎప్పుడు రెండు గ్రామాల మధ్య రైతులతో పాటు, ఇతర వాహనాలు రద్దీగా ఉంటాయి. తారు కింద ఉన్న కల్వర్టుకు రెండు మీటర్ల లోతుతో ఏర్పడిన గుంతకు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి: సంజయ్,రాజేందర్
(ఏఈ లు, రాయికల్, సారంగాపూర్, సెల్ నంబర్: 8897074366, 7702353270

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

గెలిపిస్తే అండగా ఉంటా..

- పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో రాజ సుమన్ రావు
- తెలంగాణ ఉద్యమంలో ప్రముఖ పాత్ర
- ఫిజియోథెరపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా సేవలు



రాజ సుమన్ రావు

గొల్లపల్లి: కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థిగా డాక్టర్ రాజసుమన్ రావు బరిలో దిగనున్నారు. ఈ నెల 10న ఉదయం 9 గంటలకు కరీంనగర్ కలెక్టరేట్‌లో నామినేషన్ వేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం రాపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ సుంకిసాని రాజసుమన్‌రావు గడిచిన 25 ఏళ్లలో తెలంగాణ ఉద్యకారుడిగా చురుగ్గా పాల్గొన్నారు. ఫిజియోథెరపీ వైద్యుడిగా హైదరాబాద్‌లో మలక్‌పేటలోని యశోద హాస్పిటల్ పనిచేసి, 11 ఏళ్లు తెలంగాణ రాష్ట్ర ఫిజియోతెరపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు. రైతన్నల బాగోగులు తెలిసిన ఒక రైతు బిడ్డగా గొల్లపల్లి మండలం పీఏసీఎస్ చైర్మన్‌గా ఎన్నికై బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అలాగే జగిత్యాల జిల్లా పీఏసీఎస్ చైర్మన్ ఫోరం జిల్లా అధ్యక్షుడిగా బీఆర్ఎస్ పార్టీలో కీలక నాయకుడిగా బాధ్యతలు నిర్వహించారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, కొప్పుల ఈశ్వర్, కవిత నమ్మిన బంటుగా పనిచేశారు. అనేక పదవులు చేపట్టి మంచి నాయకుడిగా పేరుతెచ్చుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పట్టభద్రులతో సత్సంబంధాలు ఉన్న వారి సమస్యల కోసం తన గళాన్ని శాసన మండలిలో పోరాడుతానని చెబుతున్నారు. గెలుపే లక్ష్యంగా ఆయన క్యాడర్ పనిచేయనుండగా లక్షకు పైగా పట్టభద్రుల ఓట్లు నమోదు చేయించారు. దీంతోతర విజయం ఖాయమనే విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

స్థానిక ఎన్నికలకు కసరత్తు షురూ!

కథలాపూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వాహణ కోసం అధికార యంత్రాంగం కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు జారీ కావడంతో మండల పరిషత్ అధికారులు ఆ దిశగా ప్రణాళిక తయారు చేయడంలో నిమగ్నమయ్యారు. మండలంలో 19 గ్రామాలుండగా... 13 ఎంపీటీసీ స్థానాలున్నాయి. మండలంలో 37,227 మంది ఓటర్లుండగా.. ఆయా గ్రామాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కోసం 66 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయనున్నారు. క్షేత్రస్థాయిలో పోలింగ్ బూత్‌లలో వసతుల గురించి అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. మరోవైపు బీఆర్ఎస్ మండల నాయకులు పోతారం, కలిగోట, ఇప్పపెల్లి, పోతారం, అంబారిపేట గ్రామాల్లో శనివారం పర్యటించి ఎన్నికలపై చర్చించడం విశేషం. ఏ రిజర్వేషన్ వస్తే ఏ నాయకుడిని బరిలో ఉంచితే విజయం సాధిస్తామనే కోణంలో నాయకులను, ప్రజలను ఆరా తీశారు. ఏదేమైనా గ్రామాల్లో స్థానిక ఎన్నికల సందడి మొదలైందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీదే గెలుపు

మల్లాపూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం పర్యటించి బీజేపీ బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ, కేంద్రం ప్రభుత్వ సుపరిపాలనతో భారతదేశం అన్నిరంగాల్లో అద్భుతమైన పురోగతిని సాధిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరాయన్నారు. స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికల్లో బీజేపీయే గెలుస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలస్థాయి నాయకులు, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

అనుమతి లేని నిర్మాణం కూల్చివేత

కథలాపూర్: మండలంలోని ఓ గ్రామంలో అనుమతి లేకుండా నిర్మాణం చేపట్టారనే కారణంతో శనివారం ఉదయం ఆ నిర్మాణాన్ని గ్రామస్తులు కూల్చివేశారు. అనుమతి లేకుండా నిర్మాణం చేపట్టవద్దని ముందస్తుగా వారికి సూచించినప్పటికీ పట్టించుకోలేదన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.